క్లుప్తంగా

117 జీవో రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : 117 జీవోను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు పేర్కొన్నారు. నగరంలోని హోచి మన్ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 117 జీవోలో భాగంగా కుదించిన ఉపాధ్యాయులను ఏక ఉపాధ్యాయ పాఠశాలలుగా ఉన్న వాటిని కనీసం ఇద్దరు ఉపాధ్యాయులచే భర్తీ చేయడం ద్వారానే ప్రాథమిక విద్య, విద్యార్థులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీలో పీఈటీ పోస్టులు 132 మాత్రమే కేటాయించిందని, ప్రభుత్వం పునరాలోచించి మరిన్ని పోస్టులు విడుదల చేయాలన్నారు. మూతపడిన పాఠశాలలను తెరిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు బి.అరుణ్, ఉపాధ్యక్షుడు తేజ, నాయకులు రాజేష్, నిఖిల్, మస్తాన్, సల్మాన్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

అవోపా అధ్యక్షుడిగా ప్రతాపం



సాయిరాం ప్రతాపం

కడప కల్చరల్ : ఆర్యవైశ్య ప్రొఫెషనల్ అండ్ అఫీసియల్స్ అసోసియేషన్ (అవోపా) కడప యూనిట్ అధ్యక్షుడిగా సాయిరాం ప్రతాపం ఎన్నికయ్యారు. ఆదివారం కడప నగరం అమ్మవారిశాలలో ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. ఈ ఎన్నికల్లో సాయిరాం ప్రతాపం అధిక మొత్తంలో ఓట్లు సాధించి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ముచ్చల్ల వెంకట సుబ్బయ్య, మునగా శ్రీనివాస్, యాదాళ్ల రమణ తెలిపారు. ఈ సందర్భంగా సాయిరాం ప్రతాపంను పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

సేవకు సత్కారం



కరీముల్లాను సన్మానిస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

కడప ఎడ్యుకేషన్ : కడపలో మూడేళ్ల నుంచి రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి అనే కరపత్రాలు ప్రజలకు, విద్యార్థులకు, యువతకు పంచుతూ ప్రచారం చేస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు, రాయల్ అసోసియేషన్ అధ్యక్షులు అబ్దుల్ షేక్ రాయల్ కరీముల్లాను ఘనంగా సన్మానించారు. జిల్లా పెన్షనర్ల కార్యాలయంలో సంఘం ప్రధాన కార్యదర్శి రామ్మూర్తినాయుడు రక్తదాతల దినోత్సవం పురస్కరించుకుని జిల్లా రెడ్ క్రాస్ తరపున జ్ఞాపిక బహూకరించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అసోసియేషన్ ప్రెసిడెంట్ రాధాకృష్ణ, సభ్యులు నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేటు' దోపిడీని అరికట్టాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని పలు ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో కొనసాగుతున్న దోపిడీకి తక్షణమే అడ్డుకట్ట వేయాలని బీజేపీ నాయకులు హరినారాయణరావు కోరారు. ఈ మేరకు ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో అడ్మిషన్ ఫీజు, పుస్తకాలు, బస్సు చార్జీలతోపాటు ఇతర ఫీజులంటూ యథేచ్ఛగా దోపిడీ కొనసాగుతోందన్నారు. ఎంతో మంది పేద విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజుల భారాన్ని మోయలేక సతమతమవుతున్నారన్నారు. ఈ విషయంగా అటు విద్యాశాఖ అధికారులు, ఇటు కడప శాసనసభ్యురాలు చొరవ తీసుకుని ఈ దోపిడీ నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించాలని కోరారు.

ఏపీఎండీసీ డైరెక్టర్ రాజీనామా

అట్లూరు : రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ముడమాల బాలమునిరెడ్డి ఆదివారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌కు మేనేజింగ్ డైరెక్టర్‌కు పంపినట్లు ఆయన తెలిపారు. ఆయన మాట్లాడుతూ తమకు పదవి ముఖ్యం కాదని వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కోసం పనిచేస్తామని ప్రకటించారు. కూటమి అధికారంలోకి రావడంతో తమ పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు.

ఆర్టీసీ బస్సు పునరుద్ధరించాలి

సింహాద్రిపురం : సింహాద్రిపురం నుంచి వెలిదండ్ల గ్రామం మీదుగా తిరిగే ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు. గతంలో ఈ రూట్‌లో విద్యార్థులకు మాత్రమే ఆర్టీసీ బస్సు తిరిగేది. కానీ మండల ప్రజలు ఆర్టీసీ అధికారులను విన్నవించుకోవడంతో అప్పట్లో సెటిల్ బస్సును తిప్పేవారు. అయితే ప్రస్తుతం ఉన్నఫలంగా ఆ బస్సు సర్వీసును ఆపేశారు. దీంతో ప్రజలు విధిలేని పరిస్థితుల్లో ఆటోలను ఆశ్రయిస్తున్నారు. విద్యార్థులు కూడా ఈనెల 13 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో బస్సులు లేక అగచాట్లు పడుతున్నారు. వెంటనే ఆర్టీసీ అధికారులు విద్యార్థులు, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బస్సును పునరుద్ధరించాలని కోరుతున్నారు.

ప్రచార పర్వంలో గండికోట

- ఇప్పటికే రైల్వేస్టేషన్లు, బస్టాండ్లలో హోర్డింగ్‌లు
- పర్యాటక ప్రాంతం ప్రోత్సాహానికి ఎయిర్‌పోర్టు అథారిటీ చర్యలు
- ఎయిర్‌పోర్టు వెలుపలి ప్రాంతాన్ని తీర్చిదిద్దుతున్న వైనం
- అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం లభించే అవకాశం



కడప ఎయిర్‌పోర్టులో ఏర్పాటు చేయనున్న గండికోట వాచ్ టవర్ నమూనా



గండికోటలోని వాచ్ టవర్



షాపింగ్ మాల్ హోర్డింగ్‌పై గండికోట చిత్రం

కడప కల్చరల్ : గ్రాండ్ క్యానియన్ ఆఫ్ ఇండియాగా మన దేశానికి తలమానికంగా నిలిచిన ప్రముఖ చారిత్రక సహజ సౌందర్యమైన ప్రాంతం గండికోట. పర్యాటకులకు వసతుల విషయంలో ఒక అడుగు వెనుక పడినా.. కోటకు ప్రముఖ పర్యాటక ప్రాంతంగా విశేషమైన పేరుంది. వారాంతపు సెలవుల్లో కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వేలాది మంది ఐటీ ఉద్యోగులు సందర్శిస్తూ ఉంటారు. దీన్ని బట్టి గండికోట ఘనతను అంచనా వేసుకోవచ్చు.

నిజానికి ఇంత ఘనమైన చారిత్రక వారసత్వ అద్భుతం మన జిల్లాలో ఉందన్న విషయం జిల్లా వాసుల్లో చాలా మందికి తెలియదు. ఇటీవల ఇంటాక్ తదితర పర్యాటక సంస్థలు చేస్తున్న ప్రచారం, నిర్వహించిన వారసత్వ ఉత్సవాల కారణంగా గండికోట వరుసగా వార్తల్లో నిలిచింది. ఫలితంగా దక్షిణ ప్రాంత సినిమాలతోపాటు హిందీ సినిమాల షూటింగ్‌లు కూడా జరుగుతుండడంతో కోటకు విస్తృత ప్రచారం లభిస్తోంది. ఇటీవల అంతర్జాతీయ ఒబెరాయ్ హోటల్స్ నిర్మాణం జరగనుందన్న వార్తలతో విశేష ప్రచారం లభించింది. ప్రస్తుతం కేంద్రం స్వదేశీ దర్శన్ పథకంలో భాగంగా అభివృద్ధి పనులు సాగుతున్నాయి. జిల్లాలోని పలు ప్రైవేటు వ్యాపార సంస్థలు ఇటీవల గండికోట పేరు పెట్టుకుని వ్యాపారాభివృద్ధికి వినియోగించుకుంటున్నాయి. చిన్న స్థాయి రోడ్డు సైడ్ హోటల్ నుంచి షాపింగ్ మాల్స్ వరకు ప్రచార హోర్డింగ్‌లలో గండికోట ఫోటోలను వాడుకుంటున్నాయి. కడప రైల్వేస్టేషన్‌లో కూడా జిల్లా పర్యాటక ప్రాంతాల ప్రచార బ్యానర్లు ఉండడం గమనార్హం.

ఎయిర్‌పోర్టుకు గండికోట శోభ

కడప ఎయిర్‌పోర్టు ఇటీవల శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇందులో భాగంగా ప్రస్తుతం ఎయిర్‌పోర్టు వెలుపలి ప్రాంతాన్ని గండికోటలో గల ప్రసిద్ధ కట్టడమైన పావురాల మండపంలా తీర్చిదిద్దుతున్నారు. బయటి నుంచి చూడగానే ఎయిర్‌పోర్టు గండికోటను తలపించేలా రూపుదిద్దుతున్నారు. గండికోటలో పావురాల మండపం సందర్శకులకు తొలి స్వాగతం పలుకుతుంది. గండికోటకు నమూనాగా దాన్ని ప్రచారంలో వాడుతున్నారు. ప్రస్తుతం ఎయిర్‌పోర్టు వెలుపలి ప్రాంతాన్ని పావురాల మండపం గుర్తుకు వచ్చేలా తీర్చిదిద్దుతుండడం విశేషం. ఎయిర్‌పోర్టుకు వెళ్లిన వారికి గండికోట తప్పక గుర్తుకు వచ్చేలా సంబంధిత అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇంతవరకు బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల ద్వారా జిల్లాలోని పర్యాటకప్రాంతాల ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గండికోటకు ప్రచారం కల్పించే బాధ్యతను ఎయిర్‌పోర్టు అధికారులు చేపట్టారు. రాకపోకలు సాగించే ప్రయాణికులు తప్పక గండికోట గురించి చర్చించేందుకు ఈ ప్రచారం ఉపయోగపడే అవకాశం ఉంది. జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాన్ని ప్రమోట్ చేసేందుకు ఎయిర్‌పోర్టు అథారిటీ తీసుకుంటున్న చర్యల పట్ల జిల్లా వాసులు, పర్యాటకాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల గండికోటకు అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం లభించే అవకాశం ఉందంటున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవిరెడ్డి

కడప రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని కడప శాసనసభ్యురాలు మాధవిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక అప్సర కూడలి వద్దగల ఓబుల్‌రెడ్డి కాంప్లెక్స్‌లో తెలుగుదేశంపార్టీ నాయకులు అందూరి రాంప్రసాద్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో 1 నుంచి 13వ డివిజన్‌కు సంబంధించిన పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, నాయకులు హరిప్రసాద్, రాంప్రసాద్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఎమ్మెల్యే మాధవిరెడ్డిని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శేషగిరిరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మేండ్రిగుత్తి గంగరాజు కోరారు. జిల్లా కార్యదర్శి కట్టాగంగాధర్, నాయకులు జయరాముడు, సరేంద్ర, వెంకటరమణ, సుబ్బరాయుడు, వెంకటేశ్వర్లు, శ్రీరాములు, కిరణ్‌బాబు, పేమ్‌సాగర్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

- ఎమ్మెల్యే మాధవిరెడ్డి దంపతులను రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్, రాష్ట్ర సమన్వయకర్త ముహమ్మద్ అయ్యూబ్, రాష్ట్ర డైరీ కమిటీ చైర్మన్ హాజీ అబ్దుల్ హకీమ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జాకీర్ హుస్సేన్, టీడీపీ మైనార్టీ నేత ఇస్తికార్ జమాల్ సన్మానించారు.

కడప కల్చరల్ : కడప నగర శివారులోని మగ్దూం సాహెబ్ కొట్టాల గ్రామంలోని శ్రీ ఇష్టక్యామార్థ కాలభైరవస్వామిని ఎమ్మెల్యే మాధవిరెడ్డి దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రముఖుడు గాజులపల్లె పురుషోత్తంరెడ్డి మొక్కు తీర్చుకోవడంలో భాగంగా 108 కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బాసట సంస్థ అధ్యక్షుడు మేరవ బాలాజీరావు పాల్గొన్నారు.

కడప కోటిరెడ్డిసర్కిల్ : మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో పాటు కడప ఎమ్మెల్యే మాధవరెడ్డిలను ఏపీఎస్ ఆర్టీసీ కార్మిక పరిషత్ నాయకులు సత్కరించారు. కార్మిక పరిషత్ జిల్లా కార్యదర్శి పురుషోత్తం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జోనల్ చైర్మన్ టీవీఎస్ నారాయణ, కడప డిపో గౌరవాధ్యక్షులు చిట్టిబోయిన సుబ్బరాయుడు, కడప డిపో కార్యదర్శి రాజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో తండ్రి పాత్ర అమోఘం



చప్పిడి వెంకటరెడ్డి సత్కారంలో పాల్గొన్న ఇంటాక్ సభ్యులు

కడప కల్చరల్: భారతీయ సమాజంలో కుటుంబం, అందులో తండ్రి పాత్ర అమోఘమైనదని ఇంటాక్ కడప చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి అన్నారు. ఇంటర్నేషనల్ ఫాదర్స్‌డేను పురస్కరించుకుని ఆదివారం శతాధిక వృద్ధుడైన చప్పిడి వెంకటరెడ్డిని పట్టు కండువాతో సత్కరించారు. కుటుంబంలో తన కంటే కుమారుడే ఉన్నత స్థాయిలో ఉండాలని ప్రతి తండ్రి కోరుకుంటాడని, పిల్లలకు ఏ కష్టం రానీయకుండా చూసుకుంటారన్నారు. అలాగే వెంకటరెడ్డి కూడా తన కుమారుడిని డీఎస్పీగా తీర్చిదిద్దారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని అదే స్ఫూర్తితో ఆయన కుటుంబంలోని ఇతర వ్యక్తులంతా ఉన్నత స్థాయికి ఎదిగారని, తమ పిల్లలను కూడా ఉత్తమమైన బాటలో వెళ్లేలా తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు. నేటితరం పిల్లలు తమ జీవితంలో తండ్రి పాత్రను గుర్తెరిగి మసలు కోవాలని, తండ్రుల త్యాగాలను మరువరాదని తెలిపారు. కల్మషం లేని సమాజాన్ని నిర్మించే బాధ్యత తండ్రులపైనే ఉందన్నారు. కార్యక్రమంలో ఆది రవికుమార్, రిటైర్డ్ డీఎస్పీ రాజశేఖర్‌రెడ్డి, ఇంటాక్ సభ్యులు కొండూరు జనార్దన్‌రాజు, బోగాల కొండారెడ్డి, రాఘవేంద్రవర్మ తదితరులు పాల్గొన్నారు.

'ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలి'



మాట్లాడుతున్న గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమైఖ్య నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల కొమ్ము కాస్తూ, ఖాళీగా ఉన్న ఎయిడెడ్ పోస్టుల భర్తీలో అక్రమాలకు పాల్పడిన ఆర్‌జేడీ, డీఈఓ రాఘవరెడ్డి, అనురాధలపై చర్యలు తీసుకోవాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమైఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు కోరారు. తమ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జీవో నంబర్ 142 ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు నడపకపోయినా, ఇష్టారాజ్యంగా ఒకచోట అనుమతి ఉంటే మరోచోట యథేచ్ఛగా విద్యాసంస్థలను నడుతున్నారని ఆరోపించారు. ఈ విషయంలో విద్యాశాఖ అధికారులు మామూళ్ల మత్తులోజోగుతున్నారని అన్నారు. వీటన్నింటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీవన్, నాగమునెయ్య, తార, హరి, వంశీలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై అధికారులు దృష్టి పెట్టాలి



రోడ్డుపైనే ఉన్న చెత్తాచెదారం

వేంపల్లె : పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్యం, డ్రైనేజీలపై అధికారులు దృష్టి పెట్టాలని పలుకాలనీ ప్రజలు కోరుతున్నారు. ఆదివారం పలు ప్రాంతాల్లోని ప్రజలు విలేకరుల దృష్టికి తీసుకొచ్చారు. స్థానిక పంచాయతీ పరిధిలోని గరుగువీధి, చైతన్య పాఠశాల, ఉషాకిరణ్ పాఠశాల, బలిజ సంఘం వీధి, భరతనగర్, క్రిస్టియన్ కాలనీ, కడపరోడ్డు, వడ్డెర వీధి, తదితర ప్రాంతాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారాలతో నిండుకున్నాయి. పంచాయతీ సిబ్బంది పట్టించుకోకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే డ్రైనేజీలో ఉన్న చెత్తచెదారాలు తీకపోవడంతో రోడ్లపైన మురుగునీరు పారుతుంది. పాదాచారులు, వాహనదారులు బయటికి రావాలంటే భయపడుతున్నారు. రోడ్లపైనే మురుగునీరు పారుతుండటంతో దోమలు అధికరంగా ఉత్పత్తి అవుతున్నాయని తెలిపారు. చాలామంది చిన్నపిల్లలు జ్వరాలతో అల్లాడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంచాయతీ పరిధిలో ఉన్న పారిశుద్ధ్యం, డ్రైనేజీ పనులు నిర్వహించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు.

తహసీల్దార్ అవినీతిపై విచారణ జరిపించాలి

జమ్మలమడుగు : ఎన్నికలకు సంబంధించిన నిధుల గోల్‌మాల్ విషయంలో తహసీల్దార్ కరుణాకర్, డిటీ వేణుగోపాల్‌లపై విచారణ జరిపించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కమిషనర్ కోటి ఆరవైరెండు లక్షల రూపాయల నిధులు కేటాయించింది. ఆ నిధులను ఎన్నికల విధులను నిర్వహించిన రెవెన్యూ ఉద్యోగులైన వీఆర్ఏ, వీఆర్వోలతోపాటు ఇతర ఉద్యోగులకు ఇతర ఖర్చులకు ఖర్చుచేయవలసి ఉంది. అయితే తహసీల్దార్, డిటీలు ఎన్నికల విధులను నిర్వహించిన ఉద్యోగులకు ఒక్కపైసా కూడా ఇవ్వలేదు. వీఆర్ఏ, వీఆర్వోలకు నిబంధనల ప్రకారం ఇవ్వవలసిన డబ్బులను ఏమాత్రం ఇవ్వకుండా వారిపట్ల దురుసుగా ప్రవర్తించడం శోచనీయం అన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని విచారణ చేపట్టాలన్నారు.

కనులు దోచే కలువ పూలు



పచ్చగా పరుచుకున్న ఆకులు.. వాటిపై రాలిన ముత్యాలాంటి నీటి బిందువులు. నీటి నుంచి నిటారుగా నిలిచిన కాండంపై సిగ్గులోలికే మొగ్గలు, విప్పారిన పుష్పాలు. అలాంటి ఇలాంటి పూలు కాదు దేవతా పుష్పాలు. ఆ పూలు.. తామరలు. చూపరులను ఆకట్టుకునే అందం వాటి సొంతం. పూలంటే సున్నితం.. తామర పూలు మరీ సున్నితం. ఇది జాతీయ పుష్పం కూడా. మండల పరిధిలోని అనంతరాజుపురం పంచాయతీ లక్ష్మీపాలెం గ్రామంలో ఉన్న శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వెనుకభాగంలో తామర మడుగులో తామర పుష్పాలు కనువిందు చేస్తున్నాయి. 16వ శతాబ్దంలో మట్లిరాజులు వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించిన సమయంలోనే ఈ మడుగును కూడా తవ్వించారు. ఇక్కడ పూచే తామర పుష్పాలను అప్పట్లో స్వామి వారికి సమర్పించి పూజలు నిర్వహించేవారు. చుట్టుపక్కల గ్రామాల్లో అనేక కుంటలు, మడుగులు ఉన్నప్పటికీ కేవలం ఇక్కడ మాత్రమే తామర పుష్పాలు పూయడం గమనార్హం.

– బద్వేలు అర్బన్



లక్ష్మీపాలెంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద కనువిందు చేస్తున్న తామర పుష్పాలు

రేపు వైద్య శిబిరం

చాపాడు: మండల పరిధిలోని టీఓపల్లె, పెద్దగురువళూరు గ్రామాలలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి రాజేష్‌కుమార్ తెలిపారు. ఆయా గ్రామాలలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ గ్రామాల్లోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేయనున్నారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

నూతన కమిటీ ఎన్నిక

పోరుమామిళ్ల: పట్టణంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థాన నూతన కమిటీ అధ్యక్షుడిగా చాటకొండు వెంకట సుబ్రమణ్యం (రత్న) ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా విశ్వనాధుల జనార్దన్‌శెట్టి, కోశాధికారిగా పొట్టి వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఉపాధ్యక్షులుగా విశ్వనాథుల వెంకటేశ్వర్లు, వల్లం పిచ్చయ్యలతో సహా 7 మంది కార్యవర్గసభ్యులు, మరో పదిమంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

వేపకాయలకు గిరాకీ

రాజుపాలెం: ఖరీఫ్ సీజన్‌లో వేపకాయల వినియోగం పెరుగుతోంది. దీంతో వేపకాయలకు గిరాకీ పెరుగుతోంది. కొన్ని గ్రామాల్లోని మహిళలు వేప కాయలను సేకరిస్తూ వాటిని అమ్ముకుంటూ జీవనం చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా అడపాదడపా వర్షాలు పడటంతో వ్యవసాయ పనులు లేకపోవడంతో వేపకాయలను సేకరించుకుంటున్నామని తెలిపారు. డబ్బా రూ.150 చొప్పున వాటిని విక్రయిస్తున్నామని తెలిపారు.

వైభవంగా పోలేరమ్మ తిరునాల

అట్లూరు: మండల పరిదిలోని రెడ్డిపల్లి గ్రామంలో వెలసిన పోలేరమ్మ తల్లి తిరునాల వైభవంగా నిర్వహించారు. శనివారం బియ్యపు కొలతతో మొదలైన తిరుణాల శనివారం రాత్రికి సిద్దాఘతి నిర్వహించారు. అనంతరం పోలేరమ్మ గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ముగిసిన గంగమ్మ తిరునాల

మైదుకూరు : మండలంలోని శివపురంలో గ్రామదేవత గంగమ్మతల్లి తిరునాల ఆదివారంతో ముగిసింది. రెండో రోజు ఆదివారం ఆలయంలోని గంగమ్మతల్లి మూల విరాట్‌కు విశేష అలంకారం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు. మధ్యాహ్నం బండలాగుడు పోటీలు నిర్వహించి వృషభరాజముల యజమానులు ఐదుగురికి బహుమతులు అందజేశారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

వేముల : స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ 18వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆలయ అర్చకులు ఆలయంలో హోమం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వెంకటేశ్వరస్వామి కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను గ్రామోత్సవం నిర్వహించారు. కోలాటం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

అనుమతి లేని పాఠశాలలను మూసేయాలి

పోరుమామిళ్ల: ప్రభుత్వ అనుమతి లేని పాఠశాలలను మూసేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అభిలాష్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలను వేలాది రూపాయలకు అమ్ముతూ విద్యార్థుల తల్లిదండ్రులను మానసిక వేదనకు గురిచేస్తున్న కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలపై చర్య తీసుకోవాలని అభిలాష్ డిమాండ్ చేశారు. పాఠశాలల్లో ఫీజుల వివరాలను నోటీస్ బోర్డులో పెట్టేలా అధికారులు చర్య తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుకు కృషి చేయాలని, త్వరలో డీఎస్సీ నిర్వహించి, ఖాళీలు భర్తీ చేయాలని కోరారు.

కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీతలకు అభినందనలు

కడప కల్చరల్ : కేంద్రసాహిత్య అకాడమి–2024 ప్రకటించిన పురస్కారాలు పొందిన పి.చంద్రశేఖర్ ఆజాద్, రమేష్ నాయక్ కార్తీక్‌లకు సీపీ బ్రౌన్ బాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రామప్రసాదరెడ్డి, సిబ్బంది అభినందనలు తెలియజేశారు. చంద్రశేఖర్ ఆజాద్ రచించిన 'మాయాలోకం'బాలల కథా సంపుటికి అకాడమీ బాలసాహిత్యంలో పురస్కారం ప్రకటించిందని, రమేష్ నాయక్ కార్తీక్ రచించిన కథల సంపుటి 'ఢావ్లో' కు కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం లభించిందన్నారు. ఈ సందర్భంగా వారు రచించిన పుస్తకాలను ప్రస్తావించారు. అలాగే బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ, గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణరావు, ఎస్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

పుస్తకాల పంపిణీలో గోల్‌మాల్?



ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు

పులివెందుల టౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ ఈ విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యేనాటికి విద్యార్థులకు అందజేయాలనే సంకల్పంతో గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం పాఠ్యపుస్తకాలను, నోట్‌బుక్స్‌ను అన్ని జిల్లాలకు అక్కడి నుంచి మండల కేంద్రాలకు అందజేయడం జరిగింది. మండల కేంద్రంగా ఎంఈఓల ఆధ్వర్యంలో ఆయా మండలాల్లోని పాఠశాలలకు పుస్తకాలు అందించడం జరిగింది.

అయితే పులివెందుల మండల కేంద్రంలో ఎంఈఓ–2గా ఉన్న రామానాయుడు ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ జరగాల్సి ఉంది. అయితే ఈ పంపిణీ వ్యవహారంలో పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరిగినట్లు సమాచారం. విద్యార్థులకు అందజేయాల్సిన దాదాపు 2వేల నోట్‌బుక్స్ మాయమైనట్లు తెలుస్తోంది. గీతల నోట్‌బుక్స్ 891, గీతలులేని నోట్‌బుక్స్ 1176, బ్రాడ్‌బుక్స్ 99, గ్రాఫ్‌బుక్స్ 11 మాయమైనట్లు సమాచారం. పాఠ్యపుస్తకాలను స్థానిక అహోబిలాపురం ప్రభుత్వ పాఠశాలలో భద్రపరచి అక్కడి నుంచి ఎంఈఓ రామానాయుడు సంబంధిత పాఠశాలల హెడ్‌మాస్టర్లకు పంపిణీ చేశారు. అయితే దాదాపు 2వేల పుస్తకాలు మాయమవడం చర్చనీయాంశమైంది. ఈ విషయాన్ని ఉపాధ్యాయులు అక్కడక్కడ చర్చించుకుంటున్నారు. పుస్తకాలు మాయంకావడంతో ఎంఈఓ హస్తమున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. పేద విద్యార్థుల పాఠ్యపుస్తకాల విషయంలో అధికారులు ఇలా వ్యవహరించడంపై పలువురు విమర్శలు చేయడం జరిగింది. దీనిపై ఎంఈఓ రామానాయుడును వివరణ కోరగా పాఠ్యపుస్తకాలు మిస్ అయిన విషయం వాస్తవమేనని, అన్ని పాఠశాలల్లో ఇచ్చిన పుస్తకాలను సరిచూసుకుని రికవరీ చేయడం జరుగుతుందన్నారు.